ఓటెందుకు వేయనట్లు..!

- రేపల్లె నియోజకవర్గంలో 84.10శాతం ఓటింగ్
- ఓటు హక్కు వినియోగించుకోని 35,920 మంది ఓటర్లు
- అధికంగా పోలింగ్‌కు పట్టణ ఓటర్లు దూరం
- గ్రామీణ ఓటర్లు, మహిళల్లోనే ఎన్నికల చైతన్యం
- ఓటింగ్‌లోనూ వారే ముందంజ



పట్టణంలోని పోలింగ్ కేంద్రంలో ఓటర్ల రద్దీ (ఫైల్)

రేపల్లె రూరల్: తమ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడపగల సత్తా గల పరిపాలన దక్షుడిని ఎన్నుకు నేందుకు ఓటు హక్కు ప్రధాన ఆయుధం. ఐదేళ్ల కోసారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ద్వారా సుపరిపాలన అందించే తమ నాయకుడుని ఎన్నుకోవాల్సి ఉంటుంది. గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. ఓటు హక్కును వినియోగించుకోవడంలో పల్లె ప్రాంతాలతో పోల్చితే పట్టణ ఓటర్లు నిర్లక్ష్యం వహించారు. రేపల్లె నియోజకవర్గంలో 35,920 మంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు అసక్తి చూపలేదు. రేపల్లె నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,27,232 మంది ఓటర్లు ఉండగా అందులో 1,11,204 మంది పురుషులు, 1,15,979 మంది స్త్రీలు, 13 మంది ఇతరులు ఉన్నారు. ఇటీవల జరిగిన పోలింగ్‌లో 1,87,730 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 92,285 మంది పురుషులు, 95,342 మంది మహిళలు ఉన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, అత్యవసర సర్వీసులలో ఉన్న వారు, దివ్యాంగులు, 80 సంవత్సరాలుపైబడిన వయోవృద్ధులు 3,582 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అయితే రేపల్లె పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళి నెమ్మదిగా సాగటం ఓటింగ్ శాతం తగ్గటానికి కారణమని పలువురు ప్రజా సంఘ నాయకులు అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 900ల నుంచి 1300ల వరకు ఓట్లు ఉండటం మరో కారణంగా భావిస్తున్నారు. ఉదయం 6.30 గంటల నుంచే రేపల్లె పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలకు అధిక సంఖ్యలో తరలి వచ్చిన ఓటర్లతో నిరంతరం రద్దీ కొనసాగటంతో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన కొంత మంది ఓటర్లు ఈ రద్దీని చూసి వెనుతిరగడం, రద్దీ తగ్గాక ఓటు వేద్దాం అనుకుంటూ పలువురు కాలయాపన చేయటంతో పోలింగ్ సమయం ముగియటం మరో కారణంగా నిలిచింది. అధిక సంఖ్యలో ఓటింగ్ కలిగిన పోలింగ్ కేంద్రాలను రెండుగా విభజించి ఉంటే రద్దీ తగ్గి పోలింగ్ పెరిగి ఉండేదని పలువురు ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

ఓటింగ్‌కు దూరంగా పట్టణ ఓటర్లు

నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పోల్చితే రేపల్లె పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకోని వారు అధికంగానే ఉన్నారు. పట్టణంలో 36,950 మంది ఓటర్లు ఉండగా 26,342 మంది ఓటు హక్కు వినియోగించుకునఆనరు. 10,608 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇక మండలాల వారీగా పరిశీలిస్తే.. రేపల్లె మండలంలో 48,691 మంది ఓటర్లు ఉండగా 42,128 మంది ఓటు వేశారు. 6,563 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. నిజాంపట్నం మండలంలో 50,195 మంది ఓటర్లు ఉండగా 41,079 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 9,116 మంది ఓటు వేయలేదు. నగరం మండలంలో 42,273 మంది ఓటర్లు ఉండగా 36,392 మంది వినియోగించుకున్నారు. 5,881 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. చెరుకుపల్లి మండలంలో 49,123 మంది ఓటర్లు ఉండగా 41,526 మంది ఓటు వేయగా.. 7,597 మంది ఓటు వేయలేదు.



అమర్తలూరులో పోలింగ్ జరిగిందిలా..

వేమూరు(అమర్తలూరు): అమర్తలూరు మండలంలో మొత్తం ఓట్లు 37,355 ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో 32,344 ఓట్లు పోలైనట్లు తహసీల్దారు కవిత శనివారం వెల్లడించారు. గ్రామాల వారీగా ఓటింగ్ వివరాలు ఇలా ఉన్నాయి..

గ్రామాలు	మొత్తం ఓట్లు	పురుషులు	స్త్రీలు	పోలైన ఓట్లు
కోడితాడిపర్రు	650	280	292	572
తురిమెళ్ల	1271	504	588	1092
మోపర్రు	2,788	1,165	1,168	2,333
బోడపాడు	1,227	527	536	1,063
ప్యాపర్రు	2,149	948	967	1,915
ఇంటూరు	4,857	1,858	2,063	3,921
యలవర్రు	1,633	730	742	1,472
గోవాడ	3,075	1,243	1,461	1,704
పాంచాళవరం	1,380	624	634	1,258
అమర్తలూరు	5,473	2,215	2,374	4,589
పెదపూడి	2,821	1,244	1,307	2,551
మూల్పూరు	4,293	1,877	1,972	3,849
యడవూరు	1,518	698	682	1,374
కూచిపూడి	4,217	1,760	1,890	3,650

సత్రం స్థలం అన్యాక్రాంతమైతే అడ్డుకుంటాం

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఇనగలూరి



మాట్లాడుతున్న ఇనగలూరి మాల్యాద్రి

బాపట్ల: పట్టణంలోని పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రం స్థలం అన్యాక్రాంతమవుతోందని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయకుడు ఇనగలూరి మల్యాద్రి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం కోన చాంబరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు సత్రంలో కుల మతాలకు అతీతంగా పిండ ప్రదానాలు, కర్మకాండలు నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. దేవదాయశాఖ అధికారులు ఐఓసీకి తూర్పుసత్రం కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తూర్పు సత్రంలో పిండ ప్రదానాలు, కర్మకాండలు చేసుకోవడానికి నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కోన రఘుపతి శంకుస్థాపన చేశారని, సత్రం అభివృద్ధి కమిటీని కూడా ఆ రోజు వేయడం జరిగిందన్నారు. ఈ స్థలాన్ని దేవదాయ శాఖ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఇండియన్ ఆయిల్ కంపెనీ పెట్రోల్ బంక్ నిర్వహణకు స్థలం ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపారని వెల్లడించారు. అస్తులు అన్యాక్రాంతం కావడం సరికాదని దుయ్యబట్టారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, లీజు ప్రతిపాదనను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు . లీజు రద్దు కాని పక్షంలో పేరం గరుడాచలం ఆస్తులను కాపాడేందుకు ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రసాద్, వెంకటప్పయ్య, పీటా బాబు, నర్రావుల వెంకట్రావు, తన్నీరు అంకమ్మరావు పలువురు పాల్గొన్నారు.

జోరుగా వర్షాలు



వెల్లటూరులో జలమయమైన ప్రధాన రహదారి

భట్టిప్రోలు: వాతావరణంలో నెలకొన్న అనూహ్య మార్పుతో గత నాలుగు రోజులుగా మండలంలో వర్షం కురుస్తూనే ఉంది. వర్షపు నీటితో రహదారులు జలమయమయ్యాయి. మురుగు నీరు, వర్షపు నీరు ఏకమై ప్రవహించింది. మరికొద్ది రోజులు పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కృష్ణానదీ పరివాహక లంక గ్రామాల్లో ఆరబోసిన పసుపు పంట కల్లాలో వర్షానికి తడిచింది. ఈదురు గాలులకు కొంత మేర అరటి, కంద, కూరగాయలు, తమలపాకు, మునగ పంటలకు నష్టం వాటిల్లింది. అలాగే మామిడి, సపోట, తోటల్లో పక్వానికి వచ్చిన కాయలు కూడా నేల రాలాయి. గ్రామాల్లోని ఉపాధి పనులకు సైతం ఆటంకం కలుగుతోంది.

త్యాగరాజస్వామి జయంతి మహోత్సవం



గీతాలాపన చేస్తున్న బృంద సభ్యులు

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజస్వామి కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సంగీత సద్గురు త్యాగబ్రహ్మ 257వ జయంతి మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత టి.ఆదిత్యవాణి, టుబాకో బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్య అతిథి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ చిరస్మరణీయుడైన త్యాగరాజ స్వామి జయంతి నిర్వహించటం విశేషమని అన్నారు. ఎంతో మంది యువ కళాకారులను ప్రోత్సహిస్తున్న గాయత్రీ మహిళా మండలి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం శ్రీత్యాగరాజ విరచిత పంచరత్న కృతుల గోష్టి గానం చేపట్టారు. ప్రధాన కచేరీలో విద్వాన్ ధూళిపాళ సాయిదీక్షిత్ (మల్లాది సూరిబాబు మనువడు)చే శాస్త్రీయ సంగీత కచేరీ జరగ్గా, త్యాగరాజ కృతులను అత్యద్భుతంగా గానం చేశారు. వీరికి వయోలిన్‌పై విదుషి గాయత్రీ విభావరి (చెన్నై), మృదంగంపై విద్వాన్ కుందుర్తి అరవింద్ (చెన్నై) చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. సమ్మండలి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎంవై శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితదేవి, కార్యదర్శి మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొన్నారు. కళాకారులను, అతిథులను ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు



చౌడేశ్వరి అమ్మవారు

పెదకాకాని: శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటా జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది 16 జ్యోతులతో శనివారం రాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకూ గ్రామోత్సవం జరుగుతుంది. గ్రామానికి చెందిన ఆడపడుచులు స్వగ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం చోటు చేసుకుంది. రాత్రి 7 గంటలకు పొంగలి నైవేద్యాలు సమర్పించారు. మంగళ వాయిద్యాలతో తొగట వీరులు కత్తులు, నారజములు, పసుపు కొమ్ములతో జలది దగ్గరకు వెళ్లి బండారు కొట్టుట జరిగింది. రాత్రి 10 గంటలకు జ్యోతుల తయారు చేసి మేళ తాళాలు, భజనలు, తీన్‌మార్ తప్పెట్ల నడుమ గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. అమ్మవారి మొక్కులు చెల్లించేందుకు 30 వేల పాటేళ్లు సిద్ధం చేశారు. ఆదివారం పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ అన్న సంతర్పణ జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు.

నిర్దేశిత లక్ష్యాల ప్రకారం వ్యాక్సినేషన్

టీబీ కంట్రోల్ ప్రోగ్రాం రాష్ట్ర జేడీ డాక్టర్ టి.రమేష్

గుంటూరు మెడికల్: టీబీ రాకుండా పెద్దలకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్లు అందిస్తున్న దృష్ట్యా వైద్య సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం అందరికీ వ్యాక్సిన్లు వేయించాలని క్షయ నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి సమావేశ మందిరంలో వైద్యాధికారులు, స్పెషలిస్ట్ డాక్టర్‌లతో శనివారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన సమీక్ష జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమేష్ మాట్లాడుతూ అడల్ట్ బీసీజీ వాక్సినేషన్‌లో గుంటూరు జిల్లా వెనుకబడటానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ చేయించుకున్న ప్రతి ఒక్కరిని 3 నెలలకు ఒకసారి 3 సంవత్సరాల పాటు ఫాలో అప్ చెయ్యాలన్నారు. వ్యాక్సిన్ వే యించుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికా రి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భి ణుల నమోదు తక్కువగా ఉన్న ఆరోగ్య కేంద్రాల వారు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు చేసి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కాన్పుల కోసం 108 అంబులెన్సు వాహనాల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. ట్యూబెక్టమీ శిక్షణ పొందిన డాక్టర్స్ వెంటనే తాము పనిచేస్తున్న ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్లు ప్రారంభించాలన్నారు. జిల్లా టీబీ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ జిల్లా అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డీఐఓ డాక్టర్ కె.వి.సుబ్బరాజు, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం పాల్గొన్నారు.

అలరించిన నృసింహ గాన వైభవం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం చింతలపాటి రమామహేశ్వరి బృందంతో నృసింహ గానవైభవం జరిగింది. బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. గాయనీమణులు చింతలపాటి రమామహేశ్వరి, ఇమ్మడి అంజనీదేవి, పావని, నాగలక్ష్మి బృందం హంసధ్వని రాగంలో తిరుమల గిరిరాయ, గంభీరనట రాగంలో శరణు శరణు, కళ్యాణి రాగంలో నవనారసింహ, సావేరి రాగంలో జయము జయము అంటూ పలు నృసింహ కీర్తనలను ఆలపించారు. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వయోలిన్‌పై పాలపర్తి అంజనేయులు, తబలాపై బాలాజీ వాద్య సహకారం అందించారు.

క్లుప్తంగా

కన్యకా పరమేశ్వరి జయంతి పూజలు



కర్లపాలెం: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య మహిళలు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలతో అలంకరణ చేసి దీపారాధన చేశారు. కుంకుమ పూజలు, అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించి కన్యకా పరమేశ్వరి గానామృతం చేశారు. కూనం గాయత్రీ భరతనాట్యం చూపరులను అలరించింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్, వాసవీ క్వీన్స్ క్లబ్, అమరజీవి పొట్టి శ్రీరాముల పవిత్రస్మృతి పరిరక్షణ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటం నుంచి పెదవడ్లపూడి రైస్ మిల్లులకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం అధికారులు తెలిపిన వివరాల మేరకు బియ్యంతో పాటు ఆటోడ్రైవర్ జల్లిపల్లి శ్రీరామ్‌ను విచారించగా విజయవాడ రూరల్, తాడేపల్లి ప్రాంతాలలో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించి రీసైక్లింగ్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎండీఎం ఆపరేటర్ల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారని, తరలించే వారితోపాటు మిల్లుల యజమానులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ.శ్రీహరిరావు తెలిపారు.

కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరగనున్న మహోత్సవాలు శనివారం అట్టహాసంగా మొదలయ్యాయి. ఉదయం అమ్మవారికి శ్రీలక్ష్మీ గణపతి హోమం, వాస్తు హోమం, రుద్ర చండీ హోమాలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తికి 108 కలశాలతో క్షీరాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం విద్యుత్తు దీపాలంకారణాలతో తీన్‌మార్, కోలాటాలతో వైభవంగా పురవీధుల్లో చేపట్టారు. ఆలయ ఈఓ పాదర్తి దుర్గారావు, పాలకమండలి సభ్యులు, ఆర్య వైశ్య సంఘాలు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మంగళగిరి డోలాస్‌నగర్ రైలు పట్టాలపై రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యకి (25) అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వివరాలు తెలిసిన వారు జీఆర్పీ ఎస్ఐ రమేష్‌బాబు 99083 83300 నంబరుకు సమాచారం తెలియజేయాలని కోరారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో నివాసముంటున్న ఓ వ్యక్తి తన కుమార్తె కనిపించడం లేదంటూ శనివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బ్రహ్మానందపురానికి చెందిన తలపాల దాసు కుమార్తె కీర్తన బీటెక్ పూర్తిచేసి ఓ ప్రైవేటు ఇన్సూ్యరెన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కీర్తనను ఉద్యోగం చేయడానికి వీలులేదని, చేస్తున్న ఉద్యోగం తాలూకూ జీతం కూడా తీసుకురావడం లేదని తల్లి మందలించడంతో కీర్తన శుక్రవారం ఉద్యోగానికి కని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. సదరు ఇన్సూ్యరెన్స్ కంపెనీ వద్ద, పలు ప్రాంతాల్లో విచారణ చేసినా ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి దాసు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ వద్ద బైక్ చోరీపై శనివారం తాడేపల్లి ఎస్ఐ సాయిప్రసాద్ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దుగ్గిరాలకు చెందిన సందీప్ పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీ కేఎల్ యూనివర్సిటీ గేటు ముందు తన ద్విచక్రవాహనం పార్క్ చేసి లోపలకు వెళ్లాడు. సాయంత్రం 5 గంటలకు బయటకు వచ్చి చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. జరిగిన ఈ సంఘటనపై ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపారు.